# దూడల పెంపకము (CALF REARING)

పాడి పరిశ్రమ నందు అంతర్లీనంగా ఇమిడి ఉండే అంశం దూడల పెంపకము. పాడి పరిశ్రమ లాభాల బాటలో నడవాలంటే శాస్త్రీయ పద్ధతుల్లో లేగ దూడల పోషణ చేపట్టి , అధిక పాల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన పశువులను అభివృద్ధి చేసుకోవాలి.

పాడి పరిశ్రమ అభివృద్ధికి దూడల పెంపకము పునాది. "నేటి దూడలే రేపటి  పాడి పశువులు". పాడిపశువు సరైన సమయంలో, సరైన వయస్సులో ఎదకు రావాలన్నా, మంచి దిగుబడినిచ్చే పాడిపశువుగా ఎదగాలన్నా, పునాది దూడగా ఉన్నప్పుడు పాటించే యాజమాన్య పద్ధతులే. దూడల పోషణ, పెంపకంలో నిర్లక్ష్యం వలన దూడల్లో మరణాలు కూడా సంభవిస్తుంటాయి.

దూడ పోషణ పశువు గర్భంలో ఉన్నప్పటి  నుంచి ప్రారంభించాలి. పశువు 6వ నెల చూడితో  ఉన్నప్పటి నుంచే దూడ పోషణ కొరకు 1 కిలో దాణా అదనంగా మేపినచో దూడ బలంగా, ఆరోగ్యంగా పుడుతుంది.





## దూడ పుట్టిన వెంటనే తీసుకోవలసిన జాగ్రత్తలు

- దూడ పుట్టగానే ముక్కురంధ్రాలను, నోటిలోని జిగురును తుడిచి శుభ్రపరచాలి
- శ్వాస సక్రమంగా జరగడం కొరకు రొమ్ము భాగంపై కొద్దిసేపు మెల్లగా మర్దన చేయాలి
- శుభ్రమైన గుడ్డతోగాని, వరిగడ్డితోగాని శరీరంపై రుద్ది శుభ్రపరచాలి
- పుట్టిన అరగంటలోపలే జున్నుపాలు పట్టాలి. పాలు త్రాగలేక బలహీనంగా ఉన్న దూడలను లేపి నిలబెట్టి పాలు త్రాగేలా చూడాలి.
- దూడ పుట్టిన వెంటనే కాళ్ళగోళ్ళు గిల్లి తీసివేయాలి.
- దూడ బొడ్డును శుభ్రమయిన బ్లేడు లేదా కత్తితో కోసి, అయోడిన్ రాయాలి.
- ధనుర్వాతము రాకుండా బొడ్డు కోసిన వెంటనే దూడకు టి.టి. ఇంజక్షన్ చేయించాలి.
- దూడ మొదటిసారి తల్లిపాలు త్రాగిన 2 – 3 గంటల లోపు విరోచనం అవ్వక పోతే ఎనిమా ఇవ్వాలి.

## జున్నుపాలు ప్రాముఖ్యత

- దూడ పుట్టిన అరగంట లోపు జున్నుపాలు త్రాగించాలి
- దూడకు జున్నుపాలు సమృద్ధిగా, తప్పనిసరిగా త్రాగించాలి. రోజులో 3 – 4 విడతలు దూడకు జున్నుపాలు అందేలా చూడాలి.
- జున్నుపాలలో వ్యాధినిరోధకశక్తి కలిగించే యాంటీబాడీస్ వుంటాయి. జున్నుపాలు త్రాగించడము వలన దూడలకు 6 నెలల వరకు రోగనిరోధకశక్తి కలిగి త్వరగా పెరగటానికి ఉపయోగపడతాయి.
- జున్నుపాలలో తేలిగ్గా జీర్ణమయ్యే మాంసకృత్తులు, విటమిన్-ఎ, కెరోటీన్ ఎక్కువ శాతంలో ఉంటాయి.
- దూడకు శరీర బరువులో 10% పాలను త్రాగించాలి.

# దూడల ఆహారము

## పాలు:

- దూడ శరీర బరువును బట్టి 3 నెలల వయస్సు వచ్చేవరకు రోజుకు 3-4 లీటర్ల పాలు త్రాగించాలి.
- దూడలకు పాలు మొదటి వారము రోజులలో రోజుకు మూడుసార్లు, తరువాత రెండుసార్లు త్రాగించాలి.
- దూడకు పారుడు లక్షణాలు కనిపిస్తే పాల మోతాదు తగ్గించాలి.
- యాంటిబయాటిక్ మందులు 3 – 5 రోజులు పాలతో కలిపి ఇస్తే పారుడు రోగం రాదు.
- పాలు త్రాగించిన తర్వాత నాలుక మీద కొద్దిగా ఉప్పు రాయటం మంచిది.

## దాణా:

- పుష్టికరమైన దాణాను ఏడవ రోజు వయస్సు నుండి అలవాటు చేయాలి. మొదట కొంచెం దాణా తీసుకొని దూడ నాలుక పైన రాయటం ద్వారా దూడ దాణా తినుటకు అలవాటు పడుతుంది.
- దాణాలో మాంసకృత్తులు 20-22 శాతము, జీర్ణమవదగ్గ ఆహారపదార్థాలు 70 శాతము ఉండాలి.
- పీచు పదార్థము తక్కువగా ఉండాలి.
- రెండవ మాసం వచ్చినప్పటి నుండి పచ్చగడ్డి తినడము అలవాటు చేయాలి.





## దూడల్లో వ్యాధులు నివారణ

- పుట్టిన 7 – 10 రోజుల మధ్య ఏలిక పాముల నివారణకు మందు త్రాగించాలి. తిరిగి 21 వ రోజు రెండవ మోతాదు, పిదప నెలకు ఒకసారి చొప్పున 6 నెలల వరకు క్రమము తప్పకుండా నట్టల మందు త్రాగించాలి.
- 6 నుండి 8 వారాల వయస్సులో గాలికుంటు వ్యాధి రాకుండా గాలికుంటు వ్యాధి నిరోధక టీకా వేయించాలి. తరువాత 35 రోజులకు బూస్టర్ డోసు ఇప్పించాలి. తరువాత 6 నెలలకు ఒకసారి టీకా ఇవ్వాలి.
- 6 మాసాల వయస్సులో గొంతువాపు టీకా మందు వేయాలి.
- పెయ్య దూడలకు మాత్రమే 4 నుండి 6 మాసాల వయస్సులో "కాఫ్ హుడ్ వేక్సిన్" ను చేయించి బ్రూసిల్లోసిస్ వ్యాధి వలన కలిగే గర్భస్రావాన్ని నివారించాలి.
- 6 నుండి 12 మాసాల వయస్సులో జబ్బవాపు నివారణ టీకామందు ఇప్పించాలి.

## దూడలకు కొమ్ములు తీసివేయుట

సంకరజాతి ఆవుల కొమ్ములు బాగా మొనదేలి ఉంటాయి. ఒక పశువును మరియొక పశువు పొడుచు కున్నప్పుడు కూడా కొమ్ములు శరీరములోకి దిగబడి ప్రమాదాలు జరుగుతాయి. అందువలన 8 నుండి 10 రోజుల మధ్య వయస్సులో దూడలకు కొమ్ములు రాకుండా చేయాలి. అనుభవము కలిగియున్న పశువైద్య సిబ్బంది దగ్గర దూడలకు కొమ్ములు తీయించవలెను.



## దూడలలో సాధారణ వ్యాధులు

తెల్లని విరేచనాలు, న్యుమోనియా, మలబద్ధకం, నట్టలు, కాక్సిడియోసిస్, బాహ్య పరాన్న జీవులు.

పై వ్యాధులు సోకినపుడు పశువైద్యుల సలహాతో వైద్యము చేయించవలెను.


**మహిళా అభివృద్ధి సొసైటీ, ప్రధాన కార్యాలయం**
ఫ్లాట్ నెంబర్: 11&12, తానేషనగర్, మణికొండ
హైదరాబాద్ – 500089
ఫోన్: 081434031 18/19/20

**కురబలకోట ఉమెన్ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్**
అంగళ్ళు, అంగళ్ళు పోస్ట్, కురబలకోట మండలం
చిత్తూరు జిల్లా – 517350 | ఫోన్: 9666 259071

**వాల్మీకిపురం ఫార్మర్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్**
పాత సొసైటీ బిల్డింగ్, బైపాస్ రోడ్డు
వాల్మీకిపురం మండలం, చిత్తూరు జిల్లా – 517299
ఫోన్: 9666 259071